www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 20 అక్టోబర్ 2023



జిల్లా కేంద్రంలో గాడి తప్పిన పాలన

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగరంలో రాజకీయ అధికార అహంకారంతో అవినీతి, దోపిడీలతో పాలన గాడి తప్పిందని పౌరసంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్ అధికారాలను చేతుల్లోకి తీసుకుని ప్రయివేటుగా ప్రీ ప్లాన్డ్ పనులను కావాల్సిన రీతిలో అడ్డగోలుగా చేయించి రికార్డులు పొందుపర్చి బిల్లులు చేసుకుంటున్నారన్నారు. ఇటువంటి ధోరణులకు సహకరించక పోవడం వల్ల గత కమిషనర్ రావిరాల మహేష్ కుమార్‌ను బదిలీ చేశారన్నారు. నెహ్రూ విగ్రహం తొలగింపు, పూలే కాలనీ పేరు మార్పు, దుమ్ము ధూళిలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు, కుళాయి చెరువు ఈశాన్యంలో వాకింగ్ ట్రాక్ మూసేసి స్కేటింగ్ రింక్ షెడ్ ఆక్రమణ, ఉప్పుటేరు ఆక్రమణలు, మేడలైను అక్రమ వంతెన నిర్మాణం అనుచిత పనులన్నారు.

గ్రామాల్లో కానరాని పల్లె వెలుగు

- సక్రమంగా అందని ఆర్‌టిసి సేవలు
- ప్రయివేటు వాహనాల్లోనే ప్రయాణం
- విద్యార్థులు, ఉద్యోగుల తీవ్ర అవస్థలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

గ్రామాల్లో పల్లెవెలుగులు కానరావట్లేదు. పల్లెల్లో ప్రయాణికులకు ఆర్‌టిసి సేవలు అరకొరగానే అందుతున్నాయి. కరోనా తర్వాత నుంచి పలు గ్రామీణ సర్వీసులు నిలిచిపోయినా నేటికీ తిరిగి ప్రారంభం కాలేదు. విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి చేతిచమురు వదిలించుకుంటున్నారు. ఉచిత, రాయితీ బస్ పాసులకు అవకాశం ఉన్నా అక్కరకు రావడం లేదు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 11 ఆర్‌టిసి డిపోల పరిధిలో 44 బస్టాండ్లు ఉన్నాయి. 350 రూట్లలో 840 ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్టాండ్ల నుంచి ప్రతి రోజూ సుమారు 5.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. పండగ వేళల్లో ఈ సంఖ్య 8 లక్షల వరకూ ఉంటుంది. సామాన్య, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలతో పాటూ వేలాది మంది స్కూల్, కళాశాల విద్యార్థులు, వందలాది మంది ఉద్యోగులు ప్రతిరోజూ ఆర్‌టిసి సర్వీసుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఒకప్పుడు ఆర్‌టిసి బస్సులు ప్రజల అవసరాలకు తగ్గట్టుగా తిరిగేవి. దీంతో ఇతర వాహనాలపై ఆధార పడాల్సిన అవసరం ఉండేది కాదు. ప్రమాదాలు కూడా చాలా తక్కువ. ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం అయిన తర్వాత సేవలు కుంటుపడ్డాయనే వార్తలు వినిపిస్తున్నాయి. వివిధ కారణాలతో గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులను నిలిపేయడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక ప్రయివేటు, సొంత వాహనాలపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.



బస్సుల్లేక ఇబ్బంది పడుతున్నాము



కరప మండలం వేములవాడ నుంచి రోజూ కాకినాడ కళాశాలకు వస్తున్నాను. సరిపడా బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు స్పందించి బస్సు ఏర్పాటు చేస్తే అనేకమంది విద్యార్థులకు మేలు చేసిన వారవుతారు.

- సంజయ్, డిగ్రీ రెండోవ సంవత్సరం

తప్పని కష్టాలు

ఏదైనా పనిపై పొరుగూళ్లకు వెళ్లాలంటే గ్రామీణ ప్రాంత ప్రజలు నానా యాతన పడుతున్నారు. ప్రయివేటు వాహనాల్లో అధిక చార్జీలను భరించలేక జేబులు గుల్ల చేసుకుంటున్నారు. కాకినాడ నుంచి యు.కొత్తపల్లి వరకూ బీచ్ రోడ్డు మీదుగా 2007 వరకూ బస్సులు నడిచేవి. దాంతో సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు ఉండేవి కావు. అయితే ఈ సర్వీసులను నిలిపివేయడంతో సమస్యలు తప్పడం లేదు. కాకినాడ నుంచి వయా పిఠాపురం మీదుగా యు.కొత్తపల్లి మండలం శ్రీరాంపురానికి ఇటీవల బస్సు సర్వీసును పునరుద్ధరించారు. అయితే ఒకే బస్సును తిప్పడంతో పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలు అందట్లేదు. కాకినాడ నుంచి సూరంపాలెంలోని ఇంజినీరింగ్ కళాశాలలకు వేలాది మంది విద్యార్థులు చదువుల కోసం వెళుతున్నారు. కాని ఈ రూట్‌లో సరిపడా సర్వీసులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాకినాడ నుంచి కోరంగికి, గొల్లల మామిడాడ వరకు నూతన బస్సు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాకినాడ తుని మధ్య సర్వీసులున్నా, ఉదయం సమయంలో తీవ్ర రద్దీ కొనసాగుతోంది. విద్యార్థులు వేలాడుతూ ప్రమాదపు అంచున ప్రయాణాలు చేస్తున్నారు. కాకినాడ నుంచి ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి బస్సు సర్వీసును నిలిపేయడంతో జేబులు గుల్ల అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. కత్తిపూడి నుంచి వజ్రకూటం, తుని నుంచి తిమ్మాపురం మధ్య సర్వీసులు కావాలని ప్రజలు కోరుతున్నా ఆర్‌టిసి అధికారులు పట్టించుకోవట్లేదు. అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లేక చాలా మంది విద్యార్థులు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. తుని నుంచి కె.మల్లవరం వెళ్లాలంటే రహదారులున్నా ఆర్‌టిసి సర్వీసులు లేవు. తొండంగి మండలం వంటిమామిడి, దానవాయిపేట పరిసర ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేదు. గతంలో తుని నుంచి తిమ్మాపురం మీదుగా శృంగవక్షం వరకూ నడిచే బస్సును ఇప్పుడు నిలిపేశారు. అలాగే శంఖవరం మండలం కత్తిపూడి నుంచి వజ్రకూటం నడిచిన బస్సు కరోనా తర్వాత నుంచి ప్రారంభం కాలేదు. పెదపూడి మండలం గొల్లల మామిడాల నుంచి కాకినాడకు నిత్యం వేలాది మంది ప్రజలు వందల సంఖ్యలో విద్యార్థులు వివిధ అవసరాల కోసం వస్తుంటారు. ఈ రూట్లో బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాల్లో అతిపెద్ద ఆసుపత్రి అయిన జీజీహెచ్ కు పూర్తిస్థాయిలో బస్సులు లేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. జగ్గంపేట మండలం గుర్రంపాలెం, గొల్లల గంట, కాండ్రేగుల, బావవరం, నెరేటి పట్నం, మామిడాడ, ఇర్రిపాక, మర్రిపాక గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఈ గ్రామాల్లో సుమారు 30వేల మంది జనాభా వుంటారు. కాజులూరు మండలంలో మూడు గ్రామాలకు తప్ప సుమారు 15 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. గతంలో మంజేరు - కాకినాడ, దుగ్గుదుర్రు - కాకినాడ, నామవారిపాలెం కాకినాడ, మతుకుమిల్లి - కాకినాడ, అంద్రంగి - కాకినాడ,తణుకువాడ -కాకినాడ బస్సులను నడిపేవారు. అయితే రద్దీ లేదనే నేపంతో ఆ బస్సు సర్వీసులను రద్దు చేశారు.



దీక్షల్లో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఒపిఎస్ కోసం నిరవధిక దీక్షలు

ప్రజాశక్తి-కాకినాడ

సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, డిఎస్‌సి-2003 వారికి తక్షణమే పాత పెన్షన్ వర్తింజేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన గురువారం దీక్షలు చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు కెవివి.నాగేశ్వరరావు అధ్యక్షతన చేపట్టిన ఈ దీక్షల్లో రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము మాట్లాడుతూ అధికారంలో కొచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరిస్తారనని గతంలో జగన్ హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకొచ్చిన తర్వాత సిపిఎస్‌పై టెక్నికల్ నాలెడ్జ్ లేదని తప్పించుకుని జిపిఎస్ అనే కొత్త నాటకానికి తెరలేపడం ఉద్యోగులను మోసగించడమేనన్నారు. ఈ ప్రభుత్వం తీసుకొస్తున్న జిపిఎస్‌ను ఏ మాత్రం వొప్పుకునేది లేదని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవి చక్రవర్తి మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన మెమో 57 ప్రకారం దేశంలో ఇప్పటికే 5 రాష్ట్రాలు పాత పెన్షన్ అమలు చేస్తున్నాయన్నారు. కేంద్రం ఇస్తున్న అన్ని జిఒలూ అమలు చేస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వం మెమో 57 కూడా అమలు చేసి మొదటిగా నష్టపోయిన డిఎస్‌సి- 2003 వారికి న్యాయం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కెవివి. నాగేశ్వరరావు మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు 2050 నాటికి పెన్షన్‌లు ప్రభుత్వానికి చాలా భారం అవుతాయని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, ఈ భారం ఏ విధంగా అవుతుందో ప్రభుత్వం జీతాలు, పెన్షన్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో టివిజిఆర్.చక్రవర్తి, పిజి.గోపాలరావు, వివి.రమణ, ఎంవి.సాయిరామ్, పి.చంద్రశేఖరరావు, సిహెచ్.సూరిబాబు, డి.కనక దుర్గాదేవి, ఆర్.సత్య ప్రసాద్, ఎ.సీతారామరాజు పాల్గొన్నారు. వీరికి ఐ.ప్రసాదరావు, బి.నాగమణి, వి.సోనీ, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీరాణి తదితరులు సంఘీభావం తెలిపారు. సిపిఎస్ రద్దుపై యుటిఎఫ్ చేస్తున్న దీక్షలకు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు తెలిపారు.

జీతాలు ఇప్పించాలని క్లాప్ డ్రైవర్స్ వినతి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగర సంస్థ పరిధిలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహన డ్రైవర్లకు సకాలంలో జీతాలు ఇప్పించాలని గురువారం నగర పాలక కమిషనర్ నాగ నరసింహారావుకు సిఐటియు ఆధ్వర్యంలోకలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ క్లాప్ వాహన కాంట్రాక్టు సంస్థ అయిన స్వయంభూ ట్రాన్స్‌పోర్ట్ ప్రతి నెలా 20వ తేదీ దాటిన తరువాతనే జీతాలు చెల్లించడం సమంజసంగా లేదన్నారు. అధికారుల సమక్షంలో 10వ తేదీ లోపు జీతాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏనాడూ అమలు చేయలేదన్నారు. కమిషనర్ దీనిపై స్పందించి కాంట్రాక్టు సంస్థతో మాట్లాడగా సిడిఎంఎ నుంచి తమకు బిల్లు రాలేదని సమాధానం చెప్పినట్లు చెప్పారు. క్లాప్ డ్రైవర్స్‌కు ఇచ్చే కొద్దిపాటి జీతం కూడా సకాలంలో ఇవ్వకపోవడం వల్ల డ్రైవర్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు ఎన్.గంగాధర్, టి.సూరిబాబు, టి.గంగాధర్, కె.రాము తదితరులు ఉన్నారు.

వవర్‌గ్రిడ్ అవగాహన వారోత్సవాలు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని వవర్‌గ్రిడ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా పిఐడిపిఐ ప్రజా సంబంధిత హక్కుల ప్రకటన, ప్రజావేగుల రక్షణ తీర్మానంపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో పిఐడిపిఐపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో అవినీతిని అరికట్టడానికి ఫిర్యాదుదారుని రక్షణ కోసం రూపొందించిన పిఐడిపిఐ తీర్మానం గురించి వివరించినారు. వవర్‌గ్రిడ్ డిజిఎం జి.సత్యవర్ధన్ మాట్లాడుతూ విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా సూరంపాలెం దగ్గరలో ఉన్న కళాశాలలో వివిధ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వవర్‌గ్రిడ్ ప్రతినిధులు ఎహెచ్‌వి.కుమార్, ఎఎస్‌ఎన్.మూర్తి, కోటేశ్వరరావు, ప్రగతి కళాశాల నుంచి సతీష్, అరుణ పాల్గొన్నారు.

'ట్రస్ట్'లో అత్యాధునిక శస్త్రచికిత్స

ప్రజాశక్తి-కాకినాడ రూరల్



లీడ్‌లెస్ పేస్ మేకర్ అమరుస్తున్న వైద్యులు

ట్రస్ట్ మల్టీ హాస్పిటల్ తన మొదటి లీడ్‌లెస్ పేస్‌మేకర్ ఇన్‌సర్షన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ అత్యాధునిక ప్రక్రియను కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్(అమెరికా) డాక్టర్ ఇలానా బి.కుటిన్స్కీ, డాక్టర్ చంద్ర మౌళి, క్యాథ్ ల్యాబ్ బృందం నిపుణులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లీడ్‌లెస్ పేస్‌మేకర్ ఒక వినూత్న వన్-పీస్ పరికరమని, ఇది సిర ద్వారా గుండెలోకి అమరుస్తామన్నారు. ఇది చర్మం కింద ప్రత్యేక బ్యాటరీ అవసరాన్ని తొలగిస్తూ రోగి సౌలభ్యం భద్రతలో గణనీయమైన పురోగతిని సూచిస్తుందన్నారు. అత్యాధునిక వైద్య సేవలను అందించడంలో ట్రస్ట్ మల్టీ హాస్పిటల్ ముందంజలో ఉందన్నారు. రోగులకు ఉన్నతమైన సంరక్షణను అందించడానికి వైద్య సాంకేతికతలో తాజా పురోగతులను చేర్చడానికి అహర్నిశలు కృషి చేస్తూ ఎన్నో విజయాలను సాధిస్తుందని వారు తెలిపారు.

మూడో రోజుకు న్యాయవాదుల దీక్ష

ప్రజాశక్తి-ఏలేశ్వరం



దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

ఎపి బార్ కౌన్సిల్ ఏకగ్రీవ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రత్తిపాడు న్యాయవాదులు మూడవరోజు విధులు బహిష్కరించి కోర్ట్ ఆవరణలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య మాట్లాడుతూ బార్ అసోసియేషన్లను సంప్రదించకుండా వెల్ఫేర్ స్టాంపులను రూ.1 నుంచి రూ.20 వరకూ పెంచడం అమానుషమన్నారు. రోజూ నాలుగైదు కక్షిదారుల తరపున మెమొలు దాఖలు చేయవలసి ఉంటుందని, ఇందువల్ల న్యాయవాదులు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బార్ కౌన్సిల్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బి.మధుబాబు, గౌరవాధ్యక్షుడు చెలంకూరి రామకృష్ణ, ఎం.గంగాధర్, కోశాధికారి జొన్నాడ రాజేష్, లింగంపల్లి శివకుమార్, న్యాయవాదులు కిలపర్తి శ్రీనివాస్, రాజాల చిట్టిబాబు, రమణం వెంకట్రావు, పిల్లి బలరాముడు, మాదాల రవి, పలివెల నాగేంద్రరాజు ఉన్నారు.

కార్టూ'నిజం'



పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-తాళ్లరేవు, గండేపల్లి

తాళ్లరేవు పంచాయతీ పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నామన వెంకాయమ్మ హైస్కూల్, మాధవరాయునిపేట మండల పరిషత్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. తహశీల్దారు ఎస్.పోతురాజు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఇఒపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తి, ఎంపిటిసిలు చిట్టూరి లలితపద్మ, చలపతి, నంది కోళ్ల శ్రీదేవి, శ్రీమన్నారాయణ, రక్షా ముత్యాలు, ఆకుల వెంకన్న, కేశవ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ కొల్లు శ్రీనివాస్, బొంతు వీర మోహన్, పొన్నాడ భైరవమూర్తి, మోర్త రాంబాబు, పిల్లి మణికంఠ, రోజా, జ్యోతి, నున్న శంకర్ నారాయణ, ఎం.వేణుగోపాల్, సురేష్, కుమార్ పాల్గొన్నారు. గండేపల్లి మండలం మురారి గ్రామంలో ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకటరామన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దారు కెవివి.సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి మూర్తి, మెడికల్ ఆఫీసర్ సౌమ్య, డాక్టర్ నరేష్, కార్యదర్శి పోతుల శిరీష, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగ పార్వతి, చెల్లారావు, ఎఎన్‌ఎంలు వెంకటలక్ష్మి, హేమ పాల్గొన్నారు.

ఆదిత్యకు టాప్ ప్లేస్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి-గండేపల్లి

ప్రాంగణ నియామకాల్లో రాష్ట్ర స్థాయిలో ఆదిత్య పాలిటెక్నిక్‌కు టాప్ పెర్ఫార్మర్ అవార్డు లభించిందని విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో అడ్వాన్సింగ్ అకాడమియా ఇండస్ట్రీ కొలాబిరేషన్ సదస్సులో భాగంగా ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలకు 2022-23 విద్యా సంవత్సరానికి ఈ అవార్డును ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్, కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సి.నాగరాణి ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌టివివిఎస్ కుమార్‌కు అందించారని తెలిపారు.

లచ్చిరెడ్డిపాలెంలో గడపగడపకూ..

ప్రజాశక్తి- రౌతులపూడి

లచ్చిరెడ్డిపాలెంలో ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. సిమెంట్ రహదారి నిర్మించాలని స్థానికులు ఎంఎల్‌ఎ పర్వతను కోరగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు శ్రీను, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తిరుమల రాయలు ఉన్నారు.

వ్యాధిగ్రస్తులకు కోడిగుడ్ల పంపిణీ

ప్రజాశక్తి కాకినాడ రూరల్

సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో పలువురు వ్యాధిగ్రస్తులకు కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో పోషకాలు ఉన్న ఆహారంగా గుడ్డును గుర్తించారని అన్నారు. కోడిగుడ్డులో ఆరు గ్రాముల ప్రోటీన్లు, 14 రకాల పోషక పదార్థాలు ఉన్నాయని అన్నారు. గుడ్లు జ్ఞాపకశక్తిని పెంచుతాయని అన్నారు. చురుకైన చూపును ఇస్తుందని వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యం అవసరం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

విద్యార్థులకు చదువుతోపాటు ఇంగ్లీష్, కంప్యూటర్ స్కిల్స్ తప్పనిసరి అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం ఇన్ఫోసిస్ శిక్షణ ప్రోగ్రాం కింద నైపుణ్యం పొందిన రెండో బ్యాచ్‌కు చెందిన 60 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇంగ్లీష్ స్కిల్స్ పెంపొందించుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా జీవించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.చిన్నారావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, శిక్షణ కర్త కె.దేవి ఉన్నారు.

ఎంపిపి నాగబాబుకు పళ్లంరాజు పరామర్శ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

ఎంపిపి అత్తులూరి నాగబాబు తండ్రి నాగేశ్వరరావు ఇటీవల మరణించడంతో ఆయనను కేంద్ర మాజీ మంత్రి ఎంఎం.పళ్లంరాజు గురువారం పరామర్శించారు. అత్తులూరి నాగేశ్వరరావు కుమారులు నాగబాబు, సాయిబాబు, శ్రీనును పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మర్రిపూడి రాంబాబు, కాట్రాలపల్లి చిన్నారి, పాలపిరెడ్డి సత్యనారాయణ, పెద్దేటి దేవుడు, మూర్తే రాజబాబు, గన్నయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహకారం

ప్రజాశక్తి-కాకినాడ



మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ, కలెక్టర్

బడుగు బలహీన, అట్టడుగు వర్గాల ప్రజలు ఆర్థికపరమైన ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారని కాకినాడ ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. గురువారం రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీలకు బటన్ నొక్కి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి చేదోడు కార్యక్రమంలో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారం లబ్ధిదారుల దైనందిన జీవన గమనంలో బాగా ఉపయోగపడుతుందన్నారు.

జగనన్న చేదోడు పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు మూడు విడతల్లో సుమారుగా 12,434 మంది లబ్ధిదారులకు రూ.37.29 కోట్ల మేర ఆర్థిక సహాయం పొందినట్లు ఎంపీ వివరించారు. చేదోడు పథకం ద్వారా అందిన లబ్ధిని సద్వినియోగం చేసుకుని వృత్తిపరమైన పరికరాలు, ఇతర డ్రైక్లీనర్స్ కొనుగోలు చేసుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం కింద మూడో విడతలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాకినాడ జిల్లాలో 12,534 మంది దర్జీలు, నాయీబ్రాహ్మణులు, రజకులకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.12.53 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఖాతాల్లో జమచేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ బిసి కార్పొరేషన్ ఇడి కెఎన్‌వి.ప్రసాద్ రావు, డిఎల్‌డిఒ పి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన 'బాబుతో నేను'

టిడిపి ఆధ్వర్యాన గురువారం జిల్లాలోని పలుచోట్ల బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం



జగ్గంపేటలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నెహ్రూ

కరప కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి గొర్రిపూడిలో గండి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమంలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ ఎంపిపి గుల్లిపల్లి శ్రీనివాసరావు, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు బుంగా సింహాద్రి, మట్టా ప్రకాష్ గౌడ్, యనమదల వెంకటలక్ష్మి, కోటగిరి మహేంద్ర బాబు, గొల్లపల్లి బుజ్జి, ఆట్ల గోవిందరాజు, మద్దూరి స్వామి, పంపన కన్నారావు, మాత అబ్బాయి, చాట్ర ఇమ్మాన్యుయేలు, వై.సుకుమార్ పాల్గొన్నారు. **పెద్దాపురం** 28 , 29 వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, పట్టణ అధ్యక్షులు రంధి సత్యనారాయణ, కార్యదర్శి తూతిక రాజు, కొరుకూరి రాజు, కాకినాడ రామారావు, బొడ్డు ఉదయ్, కౌన్సిలర్లు పప్పల దుర్గారావు, యండమూరి విజయలక్ష్మి, పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** టిడిపి రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని రామవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం పాల్గొని ప్రసంగించారు. కొత్త కొండబాబు, మండపాక వెంకటాచలం (చిన్న), గారపాటి శివ, గుర్రం వీరబాబు, గుర్రం వీర వెంకటరమణ, కొండేపూడి నాగరాజు, గట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ గురువారం నాలుగో రోజు గండేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పోతుల మోహన్‌రావు, కోర్పు లచ్చయ్యదొర, పాలచర్ల సత్యనారాయణ, బొల్లంరెడ్డి రామకృష్ణ, యలమాటి కాశీ, ఇప్పర్ల బాబి, సురేష్, వెంపాటి రాజు, ఆళ్ల సత్తిబాబు, వెంపాటి సతీష్, రెడ్డి సుబ్బారావు, చాగంటి సత్యనారాయణ, కంటిపూడి జెమి, ఇప్పిర్ల వాసు, పైల వెంకన్న, ఎల్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థులకు రక్త నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు గురువారం రక్త సమూహ విభాగ నిర్ధారణ పరీక్షలు చేశారు. యూత్ రెడ్‌క్రాస్ యూనిట్, లియో క్లబ్, రోటరీ బ్లడ్ బ్యాంక్, జక్కంపూడి వైఎస్ఆర్ బ్లడ్ బ్యాంక్ ద్వారా మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ పరీక్షలు చేసినట్టు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

రోగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేట లోని పాత ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఉన్న జాతీయ బోధ వ్యాధి నివారణా కేంద్రంలో ప్రతి గురువారం ఫైలేరియా రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్టు హెల్త్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబాబు తెలిపారు. ప్రతి గురువారం ఈ కేంద్రం వద్ద 150 నుండి 200 మంది వరకు రోగులకు ఉచితంగా మందులు సరఫరా చేయటమే కాక వారికి ఈ వ్యాధి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుతున్నామన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలో 456 మంది ఫైలేరియా రోగులు ఉన్నారన్నారు. కట్టమూరులో 65 మంది, ఇర్రిపాకలో 26 మంది రోగులు ఉన్నారన్నారు.

పంటలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

వరి వ్యవసాయ పంటల క్షేత్రాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు సూచించారు. ప్రస్తుతం పంటలు ఆరోగ్యంగా కనిపిస్తున్న వాతావరణ పరిస్థితులు దష్ట్యా ఎండాకు తెగులు, కాండం తొలుసు పురుగు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎండాకు తెగులు నిర్ధారణకు రైతులు వరి ఆకులను ఒక గ్లాసులో వేసి నీరు పోస్తే కొన్ని గంటల తర్వాత పసుపు రంగులోకి నీరు మారుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే నత్రజని ఎరువు వాడకం నిలుపుదల చేసి పొటాషియం ఎరువును ఎకరాకు 15 కిలోలు వేసుకోవాలన్నారు. రైతులకు పలు సందేహాలను నివారించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి, సిబ్బంది, రైతులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు



సారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు

4వేల లీటర్ల నాటుసారా ధ్వంసం

ప్రజాశక్తి - పిఠాపురం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలో వివిధ ఎస్ఇబి కేసుల్లో స్వాధీనం చేసుకున్న 4,050.7 లీటర్ల నాటు సారాను గురువారం పోలీస్, ఎస్ఇబి అధికారులు ధ్వంసం చేశారు. ప్రత్తిపాడు కిర్లంపూడి మధ్యలో గల నిర్మానుష్య ప్రదేశంలో దీన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సెబ్ జిల్లా అధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్తిపాడు, పెద్దాపురం, పిఠాపురం, తుని స్టేషన్ల పరిధిలో 697 కేసులకు సంబంధించిన సుమారు రూ.5 లక్షల విలువచేసే సారాను ధ్వంసం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్ఐలు ఐ.నాగవల్లి, కెవి.స్వామి, పందిరి అశోక్, బి.శ్రీనివాసరావు, విఆర్‌ఒలు వనపర్తి శివ, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - కాకినాడరూరల్

కాకినాడ రూరల్ మండలం కొత్తూరులో గురువారం వ్యక్తి హత్యకు గురయ్యాడు. కాకినాడ రూరల్ సిఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం మయూరి గ్రామానికి చెందిన గుత్తుల శ్రీను(30) తాపీ పని రీత్యా కొంతకాలంగా కొత్తూరు గ్రామానికి వచ్చాడు. అక్కడే ఆలమూరు మండలం పినపల్ల గ్రామానికి చెందిన ఒక మహిళతో సహజీవనం చేస్తున్నాడు. వీరి ఇంట్లో కుట్టుమిషన్ పోయింది. వీరు నివాసముంటున్న ఇంటి వెనుక చత్తీస్‌ఘడ్‌కు చెందిన కోసా మద్వి దొంగిలించాడనే అనుమానంతో కొన్ని రోజులుగా వీరిరువురికి వివాదం జరుగుతుంది. ఈ క్రమంలో గురువారం మరో మారు ఘర్షణ పడ్డారు. ఆగ్రహంతో కోసా మద్వి కర్రతో శ్రీనుపై దాడి చేశాడు. ఈ దాడిలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి, కాకినాడ రూరల్ సిఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

సారా కేసులో వ్యక్తి రిమాండ్

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాల నుంచి ములగపూడి వైపుగా నాటుసారా తలిస్తున్న వ్యక్తిని గురువారం ఎస్ఇబి ఇంటిలిజెన్స్ వింగ్ మంగళగిరి, తుని ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు పట్టుకున్నారు. 40 లీటర్ల సారా, బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బిఎస్‌పి మండల అధ్యక్షునిగా సుభాష్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

బిఎస్‌పి మండల అధ్యక్షునిగా చిగురుపాటి సుభాష్ నియమితులయ్యారు. బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి ఆదేశాల మేరకు జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కాంగ్రేగుల నరసింహం సమక్షంలో రావులపాలెం బిఎస్‌పి కార్యాలయంలోఆయన బాధ్య తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు గుర్రపు కొత్తియ్య, సాకా రాజారావు, కాంగ్రు వెంకటేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఎస్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. సుభాష్‌ను అభినందించారు.

ఘనంగా పృథ్వీరాజ్ పుట్టిన రోజు

కపిలేశ్వరపురం : కపిలేశ్వరపురంలో వైసిపి నాయకుల ఆధ్వర్యంలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్ పుట్టిన రోజును గురువారం ఘనంగా నిర్వహించారు. నేలటూరు, వల్లూరు, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడి, అద్దంకి వారిలంక, కేదార్లంక, టేకి, వెదురుమూడి, అంగర, పడమర ఖండ్రిక, మాచర, నాగుల చెరువు తదితర గ్రామాల్లో వైసిపి నాయకులు పృథ్వీరాజ్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పుట్టిన రోజు కేకులను కట్ చేయించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, జడ్‌పిటిసి సభ్యులు పి.వీరవెంకట సూర్యనారాయణ, పి.కృష్ణబాబు, నాయకులు దుర్గారావు, సర్పంచులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలోని 1వ వార్డు పరిధిలోని విజయలక్ష్మి నగర్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రు.1.05 కోట్లతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణ పనులను జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, వైసిపి టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, మున్సిపల్ ఎఇ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగదీష్‌కు దవులూరి పరామర్శ

సామర్లకోట రూరల్ : అనారోగ్యంతో కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సామర్లకోట 21వ వార్డు కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్‌ను ఎపి గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు గురువారం పరామర్శించారు. జగదీష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు ఆయన సూచించారు. ఆయన వెంట రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షులు దవులూరి సుబ్బారావు, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, కో-ఆప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాణ్ ఉన్నారు.

వరిలో తెగుళ్లపై జాగ్రత్తలు అవసరం

రౌతులపూడి : మండల వ్యాప్తంగా వరి సాగులో ఆకు మడత పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని వ్యవసాయ అధికారి ఆర్.ఈశ్వరరావు తెలిపారు. కావున రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పురుగు ఆకు మడతలు పత్రహరితాన్ని తినేయడం వల్ల ఆకులు తెల్లబడతాయన్నారు. పురుగును తగ్గించడానికి యూరియా సంబంధిత ఎరువులు వాడకం తగ్గించాలని. క్లోరోప్రైజెస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా ఎపిసెట్ 1.5 గ్రాములు యూరియా పిచికారీ చేసుకోవాలని రైతులకు తెలిపారు.

నైపుణ్యతను వెలికితీసేందుకే బాలోత్సవం...

-డిసెంబర్ 7న దేవరపల్లి బాలోత్సవం

-2వ పిల్లల సంబరాల గోడపత్రిక ఆవిష్కరణలో ఎంఎల్‌సి సాబ్జి

ప్రజాశక్తి - దేవరపల్లి



దేవరపల్లి బాలోత్సవం గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జి

3వ తరగతి నుంచి 10 వ తరగతి చదివే విద్యార్థులకు మంచి ఆలోచనలు పెంచడానికి, నైపుణ్యాల అభివృద్ధికి బాలోత్సవాల నిర్వహణ ఎంతగానో దోహదం చేస్తాయని ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. గురువారం దేవరపల్లిలో విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బలుసు సత్యనారాయణ అధ్యక్షతన బాలోత్సవ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోడపత్రికను ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మండలంలోని స్కూల్స్ విద్యార్థులకు బాలోత్సవం నిర్వహించుతున్న అందరూ అభినందనీయులన్నారు. తాను చదివిన దేవరపల్లి హైస్కూల్లో బాలోత్సవాలు జయప్రదంగా సాగడానికి తాను సంపూర్ణంగా భాగస్వామిని అవుతానని అన్నారు. సమాజ సంపద పిల్లలు అటువంటి వారికోసం సమాజం ఎంతో చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభాధ్యక్షులు బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ దేవరపల్లి మండలంలోని 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఒక సంబరం నిర్వహించాలని అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం హేలాపురి బాలోత్సవం కమిటీ కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ పిల్లల కోసం పెద్దలు తప్పక భాగమే బాలోత్సవాల నిర్వహణ అని అన్నారు. గతంలో జరిగిన ఆహ్వాన సంఘంలో భాగస్వాములు ఆయిన అందరినీ ఆహ్వానించాలని ఈ సమావేశంలో తీర్మానించించారు. ఈ సమావేశంలో కెరీరాజు సీతారామయ్య, ఉండవల్లి కృష్ణారావు, ఆచంట సుభాష్ చంద్ర బోస్, కూసిపూడి సత్యనారాయణ, యాలమాటి సత్యనారాయణ, హైస్కూల్ హెచ్ఎంలు పి.రవింద్ర నాథ్, వై.వైద్య, ఎస్.భగత్, కె.రత్నాజీ, ఎం.సుందరబాబు, ఎన్.రామారావు, పాల్గొన్నారు.

గంజాయి, భూకబ్జాలకు అడ్డాగా కాకినాడ

జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

ప్రశాంత వాతావరణానికి చిరునామాగా నిలిచిన కాకినాడ నేడు వైసిపి ప్రభుత్వం హయాంలో గంజాయి, భూ కబ్జాలకు అడ్డాగా మారిందనిజనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం కాకినాడలోని సూర్య కళామందిరంలో కాకినాడ నగర కార్యకర్తల విస్తతస్థాయి సమావేశం పార్టీ నగర అధ్యక్షుడు తోట సుధీర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి నాదెండ్ల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాకినాడ నగరంలో దారుణమైన పాలన ఉందన్నారు. ఇక్కడ ఉన్న పాలకులు నగరాన్ని అభివృద్ధి చేయకపోగా మురికివాడగా మార్చారన్నారు. చెత్త పన్ను వేస్తున్న సర్కారు చెత్తను మాత్రం తీయట్లేదన్నారు. విద్యుత్, ఇంటి పన్నులను పెంచుతూ వైసిపి సర్కారు ప్రజలపై భారాలను వేస్తుందన్నారు. పాదయాత్ర సమయంలో కాకినాడ సెజ్‌ను బంగాళాఖాతంలో కలిపేద్దామని చెపిన జగన్, నేడు ఆ భూములను పరిశ్రమల పేర అమ్ముకుంటున్నారన్నారు. జగనన్న కాలనీల పేర చాలామంది లబ్ధిదారులను మోసం చేశారన్నారు. పథకాలు సైతం కొందరికే అందుతున్నాయన్నారు. కాకినాడ నగరంలో పోర్టు, పరిశ్రమలు అభివృద్ధి చెందకపోగా అవి కూచించుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన కలిసి పోటీ చేస్తాయని, దీనికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. రాబోయేది జనసేన, టిడిపి ప్రభుత్వమేనన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు ముత్తా శశిధర్, కందుల దుర్గేష్, పితాని బాలకృష్ణ, తుమ్మల బాబు, శెట్టిబత్తుల రాజబాబు, వేగుళ్ల లీలా కష్ణ, తంగెళ్ల శ్రీనివాస్, సుంకర కృష్ణవేణి, పి.సరోజ, పాఠంశెట్టి సూర్య చంద, బత్తుల బలరామకృష్ణ, వరుపుల తమ్మయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దొరబాబు

జగన్‌తోనే సంక్షేమం,అభివృద్ధి

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో సామర్లకోట పట్టణ పరిధిలో వాలంటీర్లు, గృహసారథులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం మున్సిపల్ వైస్ చైర్మన్ మోజెస్ అధ్యక్షతన నిర్వహించారు. 'మళ్లీ జగనే ఎందుకు రావాలి' కార్య క్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, లక్షలాదిగా నిర్మిస్తున్న గృహ నిర్మాణాలు, అభివృద్ధి పనులను ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. సామర్లకోటలో జగనన్న కాలనీని సిఎం ప్రారంభించారన్నారు. ఎన్నోఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డిగ్రీ కళాశాల సమస్యను ఆయన పరిష్కరించారన్నారు. సామర్లకోటకు డిగ్రీ కళాశాల అందుబాటులోకి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ పర్యటనను జయప్రదం చేసిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్, జట్ల మోహన్, ఎస్.వీరభద్రరావు, నేతల హరిబాబు, వైసిపి పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను, జెసిఎస్ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి పాల్గొన్నారు.

ముగిసిన చెస్ సౌత్ జోన్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో మూడు రోజులపాటు నిర్వహించిన సిబిఎస్ఇ సౌత్ జోన్ -1 చెస్ పోటీలు గురువారం సాయంత్రం ఘనంగా ముగిసాయి. శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో అంతర్జాతీయ చెస్ పోటీలో ఆంధ్ర రాష్ట్రం నుంచి గెలుపొందిన మొదటి క్రీడాకారుడు లంకా రవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి విద్యార్థులు చెస్ పోటీల్లో పాల్గొనడం వల్ల మేధో శక్తి పెంపుందుతుందన్నారు. వ్యూహాత్మకత, సునిశిత పరిజ్ఞానం అలబడుతుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను చెస్ పోటీల్లో ప్రోత్సహించాలన్నారు. చెస్ పోటీల పర్యవేక్షణాధికారి, రాష్ట్ర చెస్ ఛాంపియన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షులు కెవివి.శర్మ మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాలకు చెందిన 300 పాఠశాలల నుంచి హాజరైన 1200 మంది విద్యార్థులకు భోజన, వసతి కల్పించిన స్కూల్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్‌ను అభినందించారు. ఈ సభలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, ఛీఫ్ రిఫరీ జివి.కుమార్ పాల్గొన్నారు.

సిఎం జగన్‌తో విద్యా వ్యవస్థ అధ్వానం

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ ఉపాధ్యాయలకు జీతాలు సక్రమంగా ఇవ్వలేని వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్ అజ్ఞానంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ అధ్వానంగా మారిందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. గురువారం కాకినాడలోని హెలికాన్ టైమ్స్‌లో కందుల దుర్గేష్, ముత్తా శశిధర్ ఇతర నాయకులతో కలిసి మనోహర్ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. భారతీయ చట్టాలకు అమోద యోగ్యం కాని స్విట్జర్లాండ్‌కు చెందిన ఐబి సంస్థతో రాష్ట్రంలో పాఠశాలలో విద్యావిధానానికీ ఒప్పందం చేసుకోవటం వెనుకు చాలా పెద్ద స్కామ్ ఉందన్నారు. రాష్ట్రంలోని దాదాపు నలబై వేలపైగా పాఠశాలల్లో ఐబి విద్యా విదానానికి రూ.వేల కోట్లు చెల్లించటానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడంలో క్విడ్‌ప్రోకో కనిపిస్తోందన్నారు. తమ నాయకుడు తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలిపారని, రానున్న రోజుల్లో రెండు పార్టీలూ ఐక్య కార్యచరణతో వైసిపి విముక్త రాష్ట్రం కోసం క్షేత్ర స్థాయిలో పని చేస్తామన్నారు. అనంతరం పలువురు కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో తోట సుధీర్, పాఠంశెట్టి సూర్యచంద్ర, వరుపుల తమ్మయ్యబాబు, అత్తి సత్యనారాయణ, పితాని బాలకృష్ణ, తుమ్మల బాబు, శెట్టిబత్తుల రాజబాబు, తంగెళ్ల శ్రీనివాస్, పొలసపల్లి సరోజ, సుంకర కృష్ణవేణి, బట్టు లీల, బండి సుజాత, బోడపాటి మరియ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక స్వావలంబన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పేద, మధ్య తరగతి మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టు శిక్షణ ఒక సాధనంగా దోహదపడుతుందని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ మోటూరి మంగతాయారు పేర్కొన్నారు. స్థానిక మహిళ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, నలుగురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు కుట్టు శిక్షణ, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంగతాయారు మాట్లాడుతూ స్త్రీలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడ్డప్పుడే మహిళా సాధికారత లభించినట్లని చెప్పారు. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ప్రతి చిన్న అవసరానికీ ఇంట్లో పురుషులపై ఆధారపడకుండా ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. గృహాలకు పరిమితమైన మహిళలకు ఇప్పటివరకు 16 బ్యాచ్‌లకు కుట్టు శిక్షణలో తర్ఫీదు నిచ్చి వారికి జీవనాధారం కల్పిస్తున్న లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ సేవలు అభినందనీయమన్నారు. నాలుగు కుట్టు మిషన్లు సమకూర్చిన డాక్టర్ చంద్రగుప్త, టిసి దేవకీదేవిని మంగతాయారు అభినందించారు

ఆర్‌టిసి కార్మికులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి కార్మికులకు శిక్షణా తరగతులు రామచంద్రపురంలో డాక్టర్ చెలికాని రామారావు భవన్‌లో గురువారం నిర్వహించారు. ఆర్‌టిసి ఉద్యోగులకు వర్తించే ప్రభుత్వ కాండక్ట్, సిసిఎ రూల్, వృత్తి పరమైన సమస్యలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై అవగాహన కల్పించారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకులు డాక్టర్ చెలికాని స్టాలిన్ అరుణపతాకం ఎగురవేసి ప్రారంభోపన్యాసం చేశారు. కార్మికులకు వృత్తి పరమైన శిక్షణతో పాటు రాజకీయ పరిస్థితులపై అవగాహన కల్పించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ రాజకీయ అంశాలను వివరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కెఎస్‌పి.రావు యూనియన్ సభ్యులు క్షేత్రస్థాయిలో చేయాల్సిన పనులను వివరించారు. పంచాయతీరాజ్ శాఖ డివిజనల్ ఆఫీసర్ ఎన్.మహాలక్ష్మికుమార్ సివిల్ సర్వీస్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు గాంధీరాజు వందనసమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్, కార్యదర్శి బిఆర్‌కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బైకులతో కాలుష్య నివారణ

ప్రజాశక్తి కాకినాడ

కాలుష్య రహితమైన ఎలక్ట్రిక్ బైక్‌లను వినియోగించడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం పొందవచ్చునని నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు పేర్కొన్నారు. నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ బైకుల ప్రదర్శనను కమిషనర్ సందర్శించారు. బైకుల పనితీరు, ప్రయోజనాలను నెడ్ క్యాప్ జిల్లా మేనేజర్ సత్యనారాయణ కమిషనర్‌కు వివరించారు. వివిధ కంపెనీల బైక్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. సుమారు మూడు గంటల పాటు పూర్తిగా ఛార్జింగ్ పెడితే 100 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చునన్నారు.

తీపర్రులో మేరా మిట్టీ మేరా దేశ్ ర్యాలీ

ప్రజాశక్తి - పెరవలి

మండలం తీపర్రు గ్రామంలో మేరా మట్టి మేర దేశ్ కార్యక్రమంలో భాగంగా అమృత కలశ ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌ఎ జి.శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యం మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల నుంచి మట్టి మెటల్, బియ్యంను కలశంలో కలిపి ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 29న ఈ కలశాన్ని ఢిల్లీ తీసుకెళ్లడం జరుగుతుందని ఎంఎల్‌ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కార్చెర్ల సీతారామ ప్రసాద్, స్టేట్ విద్యా కమిటీ మెంబర్ మండల అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ, కుందుల భూపతిరావు, జి.రామకృష్ణ, కేతా త్రిమూర్తులు, సర్పంచ్‌లు, ఎంపిడిఓ డి.దామోదరరావు, సచివాలయ, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దొరబాబు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి పెదపూడి

వైసిపి అభివృద్ధికి, గ్రామాభివృద్ధికి ఉండ్రు దొరబాబు సేవలు గుర్తించదగినవని కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి తెలిపారు. కరకుదురులో దొరబాబు జయంతి వేడుకల సందర్భంగా స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడ కార్పొరేటర్ బన్నీ, స్థానిక సర్పంచ్ ఉండ్రు చంద్రకళ, హితకారిణి సమాజం డైరెక్టర్ ఉండ్రు సత్యనారాయణ, ఉండ్రు శ్రీనివాసు తదితరులు ప్రారంభించారు. ముందుగా దొరబాబు చిత్రపటానికి చంద్రకళ దీప్తి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చంద్రకళ దీప్తి మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు పేదలకు అందుబాటులో ఉంటూ విశేష సేవలు అందించిన ఘనత దొరబాబుకి దక్కుతుందన్నారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు గీతా ప్రియ, టెక్నీషియన్స్ లలిత, అక్షయ, జి.కుమారి, పి.కుమారి 360 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సానా రాంబాబు, తోట కూర నాయుడు, వి.మాధవ, పి.గోవిందరాజు, కర్నిడి వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్

'చందూస్' ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

యానాం - ద్రాక్షారామ రోడ్డులోని వినాయక కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ చందూస్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్‌ను గురువారం యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ గాలి చందుప్రియ కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆసుపత్రిని పరిశీలించి డాక్టర్ చందుప్రియను అభినందించారు. ఈ సందర్భంగా పడాల వెంకటేశ్వరరావు దంపతులు ఎంఎల్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పలువురు నాయకులు, ప్రముఖులు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం

ప్రజాశక్తి - యానాం



యానాంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం గురువారం ఘనంగా జరిగింది. 21వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, ఆలయ కార్యనిర్వాహక అధికారి ఖండవల్లి రామకృష్ణ, మాజీ ఎంఎల్ఎ మల్లాడి కృష్ణారావు సతీమణి ఉదయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ల్యాబులు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

యానాంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్, సివిల్ విభాగానికి సంబంధించిన ల్యాబ్‌లను గురువారం ఎంఎల్ఎ శ్రీనివాస్‌అశోక్ ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కళాశాల ఆర్చ్‌ను, కళాశాలలో పలు విభాగాలను అయన పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ పి.వేలాయుధం, ఆర్ఎఒ ఆర్.మునిస్వామి, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.



ల్యాబులో పరికరాలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అశోక్